క్లుప్తంగా

11,12 తేదీల్లో మన్యం బంద్

సీతంపేట: ఇటీవల కాలంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం తన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 11,12 తేదీల్లో మన్యం బంద్ పాటించనున్నట్లు గిరిజన సంఘ నాయకుడు ఎం. తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ ఏరియాలో వందశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. పాడేరు మెడికల్ కాలేజీలో పోస్టులను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

14న ఆశీల వేలంపాట

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో రోజువారీ మార్కెట్, వారపు సంత, పశువుల సంత, జంతు వధశాల, కారు, బస్టాండ్, చెట్ల ఫలసాయం కోసం ఈ నెల 14న ఆశీల వసూళ్ల కోసం వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి ఆశీల వసూళ్ల కోసం పాటలో పాల్గొనదలచినవారు నగర పంచాయతీ సంప్రదించాలని కోరారు.

మిగులు ధాన్యం కొనుగోలు చేయాలి

పాలకొండ: రైతుల వద్ద మిగులు ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘ నాయకుడు బుడితి అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. లక్ష్యంతో సంబంధం లేకుండా రైతులు వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారికి వినతిపత్రం అందించామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్సై సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్‌కు వచ్చిన అనవసర లింక్‌లు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఇతరులకు తెలియజేయరాదన్నారు. వాట్సాప్‌కు వచ్చిన వీడియో కాల్స్ ఎట్టి పరిస్థితుల్లో అటెండ్ కావద్దని చెప్పారు. బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నాం, పోలీస్‌స్టేషన్ నుంచి కాల్స్ చెస్తున్నామంటూ కాల్స్ వస్తే వక్తిగత సమాచారాన్ని తెలియజేయరాదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

సాలూరు: మహిళా సంఘాలను సక్రమంగా నడిపేలా చర్యలు తీసుకుని వాటిని మరింత బలోపేతం చేయాలని మెప్మా పథక సంచాలకుడు చిట్టిరాజు అన్నారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలో మెప్మా ఆర్‌పీలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాంకు లింకేజీ తీసుకున్న ప్రతి ఒక్కరూ వ్యాపారం పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ఉత్పత్తులు మై స్టోర్ యాప్‌లో ఆన్‌బోర్డ్ చేసి ఆన్‌లైన్‌లో అందరూ కొనుగోలు చేసేలా అందరికీ అవగాహన పెంపొందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎంఎం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో మాడుతున్న జీడిపూత



సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో గల పోడు భూముల్లో వేసిన గిరిజనుల జీడితోటల్లో పూత పొగమంచు కారణంగా మాడిపోతోంది. చెట్టు నిండుగా పూత బాగా వచ్చిందని ఆనంద పడుతున్న గిరిజన రైతులు పొగమంచు కారణంగా పంట నష్టం కలగనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్త్రీ నిధి రుణాల రికవరీ శతశాతం చేయాలి

బలిజిపేట: గత సంవత్సరం అందించిన స్త్రీ నిధి రుణాలు రూ.6కోట్ల మొత్తాన్ని శతశాతం రికవరీ చేయాలని స్త్రీ నిధి ఏజీఎం హేమలత స్పష్టం చేశారు. ఈ మేరకు వెలుగు శిక్షణ కార్యాలయంలో వీఓఏలతో గురువారం ఆమె రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో స్త్రీ నిధి రుణాలకు మంజూరు చేసిన రూ.6కోట్లలో ఇప్పటి వరకు 5శాతం మాత్రమే వసూలైందని, మిగిలిన 95శాతాన్ని మార్చి నెలాఖరులోగా రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే కొత్త రుణాల నిమిత్తం రూ.4.50కోట్లు లక్ష్యం కాగా ఇప్పటికి రూ.3.90కోట్లు ఇచ్చామని మిగిలిన మొత్తాలను లబ్ధిదారులకు అందించాలని సూచించారు.

కనుమరుగవుతున్న కూర్మసాగరం..


విశాలంగా ఉన్న కూర్మసాగరం

- 113 ఎకారాల సాగరంలో మిగిలింది కొంతే
- ట్రెంచ్‌లు తవ్వినా ఆగని ఆక్రమణలు
- పూర్తిగా శిథిలమైన తూములు
- ఆందోళనలో రైతులు

పాలకొండ: పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సాగునీటి వనరుల్లో కూర్మసాగరం అతి పెద్ద ది. మండలంలోని ఎన్‌కే రామపురం పరిధిలోని ఉన్న కూర్మసాగరం మినీ బ్యారేజీని తలపిస్తుంది. రెండు వైపులా కొండలతో విశాలంగా 113 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు వేసవిలో సైతం నిండుకుండలా ఉండేది. ఏడాది మొత్తం వర్షాలు పడకపోయినా ఈ సాగరంలో మాత్రం నీరు ఉండడం వల్ల ఏడాదిలో రెండు పంటలు పడించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడం లేదు. ఒకరిని చూసి మరొకరు కొండల పక్కనుంచి ఆక్రమణలు మొదలుపెట్టారు. ఎగువ ప్రాంతంలో ఉన్న రైతులు ఆక్రమణలు చేపట్టడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.


ట్రెంచ్‌లు దాటి పంటపొలంగా మార్చిన సాగర గర్భం

ఇదీ సాగరం చరిత్ర..

బ్రిటీష్ కాలంలో నగర పంచాయతీ సమీపంలో 113 ఎకరాల్లో కూర్మసాగరం ఏర్పాటు చేశారు. నాగావళి ఎడమ కాలువ శివారున ఉండడంతో ఒక్కసారి కాలువ నీరు విడుదల చేస్తే ఏడాది పాటు సాగరంలో నీరు ఉండేది. ఈ సాగరం కింద సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. సమీపంలో ఉన్న కొండల నుంచి వర్షాకాలంలో వచ్చే నీరు కూడా ఈ సాగరంలో చేరేది. దీంతో ప్రతి ఏటా ఎటువంటి ఇబ్బందుల్లేకుండా రెండు పంటలు పండించేవారు. తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల్లో కూడా ఈ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడేది.

నీరు ఉండడం లేదు..



సాగరంలో నీరు ఉంటే వేసవిలో కూడా పంటలు పండించుకునే వారం. ప్రస్తుతం ఎగువ ప్రాంతంలో ఆక్రమణలు చోటుచేసుకోవడంతో సాగరంలో నీరు ఉండడం లేదు. మార్చి నెల నాటికే నీరు అడుగంటుతోంది. రబీ పంటలకు సాగునీరు లేక పంటలు వేయడం మానేస్తున్నాం. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.
– కాయల వేణు, ఆయకట్టు రైతు

తూములు ఏర్పాటు చేయాలి..



సాగరానికి రెండు తూములున్నాయి. నీరు ఎక్కువ అయితే వెళ్లిపోవడానికి పొర్లుకట్ట ఉంది. తూములు శిథిలావస్థకు చేరుకోవడంతో వేసవి నాటికే సాగరంలో నీరు ఉండడం లేదు. సాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి తూములను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి. – కిమిడి రామ్మూర్తినాయుడు, ఆయకట్టు రైతు, రైతు సంఘ నాయకుడు

ఆక్రమణలతో బక్కచిక్కి..

ప్రస్తుతం కూర్మసాగరం ఆక్రమణలతో బక్కచిక్కుతోంది. ఎగువ ప్రాంతంలో ఉన్న రైతులు సాగరాన్ని పంటపొలంగా మార్చుకుంటున్నారు. వేసవిలో నీరు తగ్గిన సమయంలో పొలంగా మార్చుకుని పంటలు సాగుచేస్తున్నారు. చెరువులో నీరు పుష్కలంగా ఉంటే మాత్రం ఆక్రమిత ప్రాంతం నీటితో నిండిపోతోంది. దీంతో ఆక్రమణదారులు తాజాగా దిగువభాగంలో ఉన్న తూములను శిథిలం చేసి సాగరం నీరు బయటకు విడిచిపెట్టేస్తున్నారు.

ట్రెంచ్‌లను కప్పేసి..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయకట్టు రైతుల ఫిర్యాదుతో సాగరం చుట్టూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. సాగరం విస్తీర్ణాన్ని కొలిచి ఆక్రమణలో ఉన్న పొలాలను తిరిగి సాగరంలో కలిపి ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ట్రెంచ్‌లను తిరిగి ఆక్రమించేశారు. 113 ఎకరాల్లో ఉన్న సాగరంలో ఇప్పటికే 30 ఎకరాలను ఆక్రమించుకోగా.. మరో 30 ఎకరాలు తుప్పలు, డొంకలతో నిండిపోయాయి.

కంబరవలస హైస్కూల్‌లో ప్యానల్ ఇన్‌స్పెక్షన్


కంబరవలస హైస్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి

వీరఘట్టం: మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేపట్టాలంటే ఉపాధ్యాయులు కూడా సబ్జెక్ట్‌లపై పట్టు కలిగి ఉండాలని డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి అన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. హెచ్‌ఎం వై.లక్ష్మి, ఉపాధ్యాయుడు అన్ను వెంకటరావు, బిటివాడ హెచ్‌ఎం రత్నాకరరావు పాల్గొన్నారు.

విధివిధానాలు ప్రకటించాలి



కుంకి ఏనుగు విషయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ విధివిధానాలు ప్రకటించాలని సీపీఎం జిల్లా నాయకుడు సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కుంకి ఏనుగుల సహాయంతో ఈ ప్రాంతంలో సంచరిస్తున్న అటవీ ఏనుగులను గ్రామాల నుంచి దూర ప్రాంతాలకు తరలించాలని కోరారు. పంటలతో పాటు రైతుల ప్రాణాలు కాపాడాలని కోరారు.
– కొమరాడ

ఏటా దూడ కలిగితే ఆర్థిక భరోసా

సీతానగరం: మండలంలోని పాడి పశువులు ఏడాదికో దూడను ఈనితేనే రైతుకు పాడితో పాటు, ఆర్థిక భరోసా కలుగుతుందని సీతానగరం పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు.

సీతానగరం సబ్‌డివిజన్ కార్యాలయంలో చూడి తనిఖీలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీడివిజన్ పరిధిలో బలిజిపేట, సీతానగరం మండలాల్లో గొర్రెలు, మేకల మందలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వ్యాధి నిరోధక మందులు సిబ్బంది సహకారంతో వేస్తున్నట్లు చెప్పారు. శీతాకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ నిర్దేశించిన గడువుకు ముందుగానే వేశామని తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామిని దర్శించిన జేసీ


స్వామివారి ఆశీర్వాదం తీసుకుంటున్న జాయింట్ కలెక్టర్ శోభిక, కుటుంబసభ్యులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామిని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక కుటుంబసభ్యులతో కలిసి గురువారం దర్శించారు. ఈ సందర్భంగా జేసీ కుటుంబసభ్యులతో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు చేయించారు. అలాగే స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి ముడుపుల పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి ఉపవాసాలతో వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వర్తక కలాసీల సమస్య పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: వర్తక కలాసీల సమస్య పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న వర్తక కళాశాలకు గురువారం ఆయన మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి యజమానులకు కలాసీలకు మధ్య వేతన ఒప్పందం జరుగుతుంది. పెరుగుతున్న ధరలతో విద్య వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయని, దానివల్ల కుటుంబ పోషణ కష్టమవుతోందన్నారు. కార్మికుల కష్టాన్ని యజమానులు అర్థం చేసుకుని వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. సిమెంట్, ఐరన్ వెజిటబుల్స్, కొబ్బరి కాయల రేట్లకు యాజమాన్యం అంగీకరించింది. కిరాణా ట్రాన్స్‌పోర్ట్‌కు మాత్రం అంగీకరించకపోవడం చాలా దారుణమన్నారు.

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దాం

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ
- జిల్లా బాలల సంరక్షణపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్:

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దామని ఐసీడీఎస్ పీడీ టి కనకదుర్గ అన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆఫీసులో గల కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్‌ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీస్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, సీడీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశం నిరవహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాల నివారణకు జీఓ నంబర్ 31–39 ప్రకారం జిల్లాలో ఉన్న అధికారులు స్టేషన్ హౌస్‌ఆఫీసర్, మహిళా సంరక్షణ కార్యదర్శులను చైల్డ్ మ్యారేజ్ ప్రొబేషన్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించిందన్నారు. బాల్యవివాహాల నివారణ అధికారులు(సీఎంపీఓ)గా మహిళా పోలీసులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, గ్రామ సెక్రటరీ వీఆర్‌ఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు విధులు నిర్వహించాలని కోరారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నివారణ అండ్ మానిటరింగ్ కమిటీలను గ్రామస్థాయిలో నియమించామన్నారు. వాటిని బలోపేతం చేసి ఫంక్షనింగ్ అయ్యేలా గ్రామస్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

అవగాహన కల్పించాలి

కిశోరీ వికాసం ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో కౌమర దశలో ఉన్న బాలబాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి వారి ఆరోగ్యం, విద్య, న్యూట్రిషన్ గ్రోత్, రక్తహీనత, లైఫ్‌స్కిల్స్, సెల్ఫ్‌డిఫెన్స్, లైంగిక దాడులు, ఋతు చక్రం పరిశుభ్రత తదితర విషయాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పిల్లలపై జరిగే లైంగిక దాడులను అరికట్టాలని గ్రామస్థాయిలో ఉన్న హైస్కూల్స్, జూనియర్ కాలేజీల్లో ఉన్న ఆడ, మగ పిల్లలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. జిల్లాలో అనధికార దత్తత జరగకుండా చూడాలని, ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి లైంగిక దాడులు జరగకుండా పిల్లలందరికీ పిల్లల చట్టాలపై అవగాహన కల్పించాలని మహిళా కార్యదర్శులకు తెలియజేశారు. అనంతరం ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, జిల్లా బాలల సంరక్షణ విభాగం, లీగల్ కమ్ ప్రొహిషన్ ఆఫీసర్ పి.శ్రీధర్ పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన


అవగాహన వాల్‌పోస్టర్లతో వైద్యసిబ్బంది

పాలకొండ రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గుండెపోటుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరెంటెండెంట్ జి.నాగభూషణ్ మాట్లాడుతూ.. గుండెపోటుకు ఎమర్జెన్సీగా ఇచ్చే టేనెక్టివ్ ప్లస్ ఇంజిక్షన్ ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గతంలో గుండెపోటు వ్యాధిగ్రస్తులు అత్యవసర సమయంలో శ్రీకాకుళం, విశాఖపట్టణం వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇకపై ఆ పరిస్థితి లేదని.. రూ. 45 వేల విలువ చేసే ఇంజిక్షన్ ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో 'స్టెమి'

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): గుండెపోటు బాధితులకు వేసే స్టెమీ ఇంజిక్షన్ కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని వైద్యులు బి.శోభారాణి, కె.సందీప్, కె.సునీల్‌కుమార్, ఎస్.ఆశ, జి.మౌనిక, ఎ.సాయిప్రసాద్, ఆర్.సుకృత తెలిపారు. ఈమేరకు గురువారం సీహెచ్‌సీకి వచ్చిన రోగులతో పాటు స్థానికులకు స్టెమి ఇంజిక్షన్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు బాధితులకు రూ. 45 వేల విలువ చేసే స్టెమి ఇంజిక్షన్ వేయడం వల్ల..తదుపి చికిత్సకు సమయం ఉంటుందన్నారు. తద్వారా రోగిని ప్రాణహాని నుంచి తప్పించవచ్చని చెప్పారు.


భద్రగిరి సీహెచ్‌సీలో స్టెమి ఇంజిక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు


కురుపాం సీహెచ్‌సీలో స్టెమి ఇంజిక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భద్రగిరి సీహెచ్‌సీలో..

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అందుబాటులో ఉండే స్టెమి ఇంజిక్షన్‌తో గుండె జబ్బుతో వచ్చే రోగుల ప్రాణానికి భరోసా ఉంటుందని భద్రగిరి సీహెచ్‌సీ వైద్యులు రవికుమార్, డి.రమయ్య, దుర్గాప్రసాద్ అన్నారు. భద్రగిరి సీహెచ్‌సీలో స్టెమి ఇంజిక్షన్‌పై అవగాహన కల్పించారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన

భామిని: సాధారణ విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ వై.సత్యం, ట్రాన్స్‌కో ఏఈ బి. శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం విశిష్టతను, అందించే రాయితీలను వివరించారు. అనంతరం ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, ఏపీఓ కలిశెట్టి శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడారు.


సోలార్ పథకంపై వివరిస్తున్న అధికారులు

ఉపాధి పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ ఎస్. రమేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి వేతనదారుల మస్టర్లలో తప్పులు ఉండరాదని సూచించారు. మస్టర్లు వేసే విషయంలో ఎటువంటి తప్పిదాలు జరిగినా చర్యలు తప్పవన్నారు. ప్రతిరోజూ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ పనుల వద్దకు వెళ్లాలని ఆదేశించారు.


వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

గడువు పెంపు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం నియోజకవర్గ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న కల్లుగీత కార్మికులు/కులస్తులకు ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువు పెంచిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత సమయానికి దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, స్థానిక నివాస ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వంచే జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు దరఖాస్తు రుసుం రూ.2 లక్షల డీడీ/చెక్ జత చేయాలని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో తోయక శ్రీకాంత్ ఇంటిలో అనధికారంగా ఉన్న 48 మద్యం బాటిళ్లను స్వాధీనపర్చుకున్నట్లు పార్వతీపురం ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ బాబు, కురుపాం ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు కురుపాం ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సిబ్బందితో కలిసి గుమ్మలక్ష్మీపురం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించగా దుడ్డుఖల్లు గ్రామంలోని శ్రీకాంత్ ఇంటిలో రూ. 9 వేల విలువ చేసే ఒడిశాకు చెందిన మద్యం బాటిళ్లు లభించాయని, వాటికి శ్రీకాంత్ ఎటువంటి రశీదులు చూపకపోవడంతో బాటిళ్లు స్వాధీనపర్చుకోవడంతో పాటు అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరి వెంట ఈఎస్‌టీఎఫ్, కురుపాం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

శీతల గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలి


శీతల గిడ్డంగి నిర్వహణపై ఆరా తీస్తున్న ఉద్యానవనశాఖ జిల్లా అధికారి శ్యామల

వీరఘట్టం: మండల కేంద్రం సమీపంలోని వెంకమ్మ చెరువు దగ్గర నిర్మించిన శీతల గిడ్డంగులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి. శ్యామల కోరారు. గురువారం ఆమె గిడ్డంగిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గోదాముల్లో రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని, గిట్టుబాటు ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చని సూచించారు. ఆమెతో పాటు పాలకొండ ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు కరణం కిరణ్, ఏపీఎం కె.రాము, సీసీ ఆనందరావు, తదితరులున్నారు.

బెంచీల ఏర్పాటు

భామిని: మండలంలోని పెద్దదిమిలి కాలనీ మల్లికార్జునపురం గ్రామదేవత సన్నిధిలో సిమెంట్ బెంచీలను గురువారం ఏర్పాటు చేశారు. మనజనం సేవా సంస్థ నిర్వాహకుడు చందు జనపాల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం వీటిని ఏర్పాటు చేశారు.